సర్కారు స్కూళ్లలో పెరిగిన అడ్మిషన్లు

- విద్యావ్యవస్థలో సమూల మార్పులు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- 'నాడు–నేడు' పనులతో మారిన పాఠశాలల రూపురేఖలు
- విద్యార్థులకు పాఠశాలలో అన్ని సౌకర్యాలు
- ఈ విద్యాసంవత్సరానికి 600కు పైగా కొత్త అడ్మిషన్లు




బూజునూరు ఎంపీపీ స్కూల్‌లో అడ్మిషన్ తీసుకుంటున్న తల్లి (ఫైల్), విద్యాకానుక పంపిణీ చేస్తున్న దృశ్యం

గడివేముల: గత ప్రభుత్వం హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ఎవరూ ఆసక్తి చూపేవారు కాదు. పేదలు సైతం ఆర్థికంగా భారమైన తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపేందుకే మొగ్గుచూపేవారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆ పరిస్థితి కనిపించడం లేదు. నాడు వద్దనుకున్న వారే నేడు సర్కారు స్కూళ్లలో అడ్మిషన్లకు క్యూ కడుతున్నారు. ఫలితంగా అడ్మిషన్లు పెరిగాయి. గత నాలుగేళ్లలో సర్కారు స్కూళ్ల అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన చర్యలే మార్పునకు కారణంగా తెలుస్తోంది.

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా..

నాడు–నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. వసతుల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దడంతో పాటు నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నారు. పిల్లల చదువు తల్లిదండ్రులకు భారం కాకూడదని ప్రభుత్వం జగనన్న విద్యాకానుక పేరుతో పుస్తకాలు, యూనిఫాం, బూట్లు తదితరాలు ఉచితంగా అందించడమే కాక అమ్మఒడి పథకంతో ఆర్థికంగా అండగా నిలుస్తోంది.

పెరిగిన హాజరు శాతం

విద్యార్థులకు రుచికరమైన మధ్యాహ్న భోజనం అందిస్తుడంతో పాఠశాలలో చేరేందుకు విద్యార్థులు సముఖత చూపుతున్నారు. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా సర్కారు బడుల్లో విద్యార్థుల హాజరు శాతం గణనీయంగా పెరిగింది. విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి పాఠశాలలో చేరేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ముందుకు వస్తున్నారు. గతేడాది మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 3,456 మంది విద్యార్థులు విద్యను అభ్యసించగా, 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఇప్పటి వరకు 4,108 మంది విద్యార్థులు ఉన్నట్లు విద్యాధికారులు చెబుతున్నారు. అంటే 652 మంది కొత్తగా సర్కారు స్కూళ్లలో చేరారు.

మా ఊరి బడే బాగుంది



మాపాప జీవన కుమారి 3వ తరగతి చదువుతుంది. మా పాపను బాగా చదివించుకుందామని ఓ ప్రైవేట్ స్కూల్‌లో చేర్పించాను. డబ్బులు పోయినాయి తప్ప చదువు రాలేదు. మా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నాడు–నేడు పనులతో రూపు రేఖలు మారిపోయాయి. పాఠశాలలో పిల్లలకు చదువుతో పాటు అన్ని సౌకర్యాలు ఉండటంతో ఈ ఏడాది మూడవ తరగతిలో అడ్మిషన్ తీసుకున్నాను. కార్పొరేట్ పాఠశాలలో లేని వసతులు మా ఊరి ప్రభుత్వం పాఠశాలలో ఉన్నాయి.

– మేరమ్మ, బూజునూరు గ్రామం

విద్యార్థులకు ఎంతో మేలు



నేను 10ఏళ్లుగా ఉద్యోగం చేస్తున్నాను. ప్రభుత్వ పాఠశాలలు ఇంతస్థాయిలో రూపుదిద్దుకోవడం ఎన్నడూ చూడలేదు. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలకు తమ పిల్లలను పంపించేందుకు అనాశక్తి చూపే తల్లిదండ్రులు నేడు చేర్పించేందుకు ముందుకు వస్తున్నారు. సాంకేతిక విద్యను అందిపుచ్చుకొని మారుతున్న కాలానికి అనుగుణంగా పాఠ్యాంశాల బోధనకు స్మార్ట్ టీవీలు ఎంతో ఉపయోగపడతాయి. మా పాఠశాల పునఃప్రారంభమైనప్పటి నుంచి పిల్లలను చేర్పేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు వస్తూనే ఉన్నారు.

–రవి, హెచ్‌ఎం, ఎంపీపీ పాఠశాల,బూజునూరు

గతంలో ఎన్నడూ లేని విధంగా అడ్మిషన్లు



గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు జరుగుతున్నాయి. మండలంలో 38 పాఠశాలల్లో 175 మంది ఉపాధ్యాయులు దాకా పనిచేస్తున్నారు. ప్రభుత్వం నాడు–నేడు పనులతో పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. ప్రభుత్వం అందిస్తున్న విద్యాకానుక కిట్లను పాఠశాలలో చేరిన రోజునే ఇస్తున్నాం. అలాగే పాఠశాలలో జగనన్న మధ్యాహ్న భోజనం అందిస్తుండటంతో విద్యార్థులు పాఠశాలలో చేరేందుకు ముందుకు వస్తున్నారు. దీంతో పాటు 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లను ప్రభుత్వం అందిస్తోంది.

– రామకృష్ణుడు, ఎంఈఓ, గడివేముల

క్లుప్తంగా

ఘనంగా చౌడేశ్వరీ దేవి జయంతి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఓర్వకల్లు : మండల కేంద్రమైన ఓర్వకల్లు గ్రామంలో వెలసిన చౌడేశ్వరీ మాత జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక తొగట వీర క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు శ్రీనివాసులు చౌడేశ్వరీ మాతకు అభిషేకం నిర్వహించి నూతన వస్త్రాలతో అలంకరించారు. అనంతరం కుంకుమార్చన చేసి స్థానిక చెన్నకేశవ స్వామి భజన మండలి వారిచే భజన కార్యక్రమం జరిపారు. భక్తులకు భోజన వసతి కల్పించారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు



కోనేటి ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఓర్వకల్లు : మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో వెలసిన ఆంజనేయస్వామి దేవస్థానాలలో సోమవారం అమావాస్య పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయాలు కిటకిటలాడాయి. ఇందులో ప్రధానంగా బొడ్డువానిపల్లె వద్ద ఉన్న వీరాంజనేయస్వామి దేవస్థానంలో, కొమ్ముచెరువు ఆంజనేయస్వామి దేవస్థానం, అలాగే కాల్వ గ్రామం వద్ద గల కోనేటి ఆంజనేయ స్వామి ఆలయంలో ఉదయం అభిషేకార్చనలు, సింధూర అలంకరణ, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఆకుపూజలు, రాత్రి వివిధ ప్రాంతాలకు చెందిన భజన బృందాల గీతాలతో ఆలయ ప్రాంతం మార్మోగింది. మంగళవారం తెల్లవారు జామున స్వాముల వారికి మహా మంగళహారతి సమర్పించారు.

జగనన్న సురక్షపై అవగాహన కల్పించండి

కోడుమూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్షపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లదేనని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని ముడుమలగుర్తి గ్రామంలో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్ పరిశీలించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిదారుడికి అవసరమైన సర్వీసు వివరాలను తెలుసుకుని నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే రైస్ కార్డు, ఫ్యామిలీ మెంబర్ యాడింగ్, స్లిప్పింగ్‌ను కూడా నమోదు చేసుకుని పరిష్కరించాలని ఆదేశించారు.

భూములకు పట్టాలు ఇవ్వాలి

కల్లూరు: బొల్లవరం గ్రామంలో పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ, రైతు సంఘం నాయకులు తహసీల్దార్ రమేష్‌బాబుకు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ కొంత కాలంగా బొల్లవరం గ్రామంలో సర్వేనెం 1లో పేదలు పంటలు సాగు చేసుకుంటున్నారన్నారు. వారందరికీ పట్టాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎ.కృష్ణ, వెంకటస్వామి, శేఖర్, రాజు,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మహాపాదయాత్రను జయప్రదం చేయండి

కర్నూలు (న్యూటౌన్): జిల్లా సమగ్రాభివృద్ధికై సీపీఎం చేపట్టిన మహాపాదయాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నారాయణ పిలుపునిచ్చారు. సోమవారం కర్నూలు మండలం గొందిపర్ల గ్రామంలో మహాపాదయాత్ర జీపు జాతాను జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో నెలకొన్న ప్రజా, కార్మిక, రైతు సమస్యలు పరిష్కరించాలని, జిల్లా సమగ్ర అభివృద్ధికి రూ.10వేల కోట్లు కేటాయించాలని కోరుతూ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. రవాణా రంగ డ్రైవర్లు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరాముడు, సీపీఎం మండల కార్యదర్శి హుస్సేనయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

కేసీ కాల్వకు 130 క్యూసెక్కుల నీటి విడుదల

గూడూరు: సుంకేసుల డ్యాం నుంచి కర్నూలు నగర ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం 130 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు సోమవారం ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో నిలిచిపోయిందని, జలాశయంలో 0.881 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

స్వచ్ఛభారత్ సమన్వయకర్తగా గఫూర్

గడివేముల: మండల స్వచ్ఛభారత్ మిషన్ రిసోర్స్ కో–ఆర్డినేటర్‌గా దూదేకుల గఫూర్‌ను నియమించినట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప తెలిపారు. సోమవారం గఫూర్‌కు నియామక పత్రం అందజేయగా, ఆయన బాధ్యతలు స్వీకరించారు.



దూదేకుల గఫూర్‌కు నియామక పత్రాన్ని అందిస్తున్న ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప

సులభంగా ధ్రువీకరణ పత్రాలు

కల్లూరు: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు కుల, ఆదాయ ధ్రువీకరణ, ఫ్యామిలీ మెంబర్, రేషన్ కార్డులో మార్పులు, చేర్పులు, హౌస్‌హోల్డ్ మ్యాపింగ్, ఆధార్‌కార్డుకు మొబైల్ లింక్ తదితర 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తున్నట్లు ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి తెలిపారు. సోమవారం బస్తిపాడు, పుసులూరు గ్రామ సచివాలయాల వద్ద క్యాంపులు నిర్వహించి దరఖాస్తు చేసుకున్న వారికి ధ్రువీకరణ పత్రాలను అందించారు. బస్తిపాడు–700 మందికి, పుసులూరు–710 మందికి ధ్రువీకరణ పత్రాలు అందించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గిరికుమార్‌రెడ్డి, ఈఓఆర్డీ రవికిషోర్, సర్పంచ్ రవి, ఎంపీటీసీ నాగేశ్వరరావు, నాయకులు రామకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు పులకుర్తిలో 'జగనన్న సురక్ష'

కోడుమూరు రూరల్ : మండలంలోని పులకుర్తి గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. కార్యక్రమానికి కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు వివిధ రకాల సర్వీసులకు సంబంధించిన సర్టిఫికెట్లు పంపిణీ చేస్తారన్నారు. పులకుర్తి వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

కల్లూరు: మండల పరిధిలోని ఉలిందకొండ గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ జీవీ రమణమూర్తి తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరవుతారన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

కోడుమూరు రూరల్ : భూముల రీ సర్వేతో మండలంలో నెలకొన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కోడుమూరు తహసీల్దార్ జయన్న తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలు, రైతుల నుంచి వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా భూ సమస్యలపై పలువురు రైతులు అర్జీలు సమర్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో ప్రస్తుతం భూముల రీసర్వే కార్యక్రమం జరుగుతుందని, సర్వే పూర్తయితే భూముల సమస్యలన్నింటికీ పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శరభయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఏడుకొండలు, ఏపీఎం పుష్పావతి, ఈఓఆర్డీ మంజుల తదితరులున్నారు.

అనుమతి లేని పాఠశాలను సీజ్ చేయండి

గూడూరు: పట్టణంలో ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్వహిస్తున్న గ్లోబల్ పాఠశాలను సీజ్ చేయాలని సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ శివశంకర్ నాయక్‌కు కౌన్సిలర్లు సురేష్, బుడ్డంగలి ఫిర్యాదు చేశారు. లోతట్టు ప్రాంతంలో పాఠశాల ఏర్పాటు చేశారని, వరదలకు పాఠశాల మునిగిపోయే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థుల పరిస్థితి ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని విచారించి పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. విచారించి నివేదిక ఇవ్వాలని ఎంఈఓ సునీలమ్మకు తహసీల్దార్ ఆదేశించారు.

మందుబాబులకు జైలుశిక్ష

కర్నూలు: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన పది మందికి రెండు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ కర్నూలు స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి రత్నం తీర్పు చెప్పారు. కర్నూలు అర్బన్ తాలూకా సీఐ శ్రీరామ్ ఆధ్వర్యంలో కర్నూలు మండలం పంచలింగాల చెక్‌పోస్టు దగ్గర ఆదివారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. తెలంగాణలో మద్యం తాగి 44వ నంబర్ జాతీయ రహదారిపై వాహనాలపై వెళ్తున్న కర్నూలుకు చెందిన చంద్రశేఖర్, ఇందిరాగాంధీ నగర్‌కు చెందిన మధుసూదన్, మాసామసీదుకు చెందిన వెంకటేశ్వర్లు, కొత్తూరు గ్రామానికి చెందిన నాగేశం, పంచలింగాల గ్రామానికి చెందిన రఫిక్ బాషా, ఎస్‌ఆర్ పేటకు చెందిన మురళీగౌడ్, గూడూరు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన బాలచంద్రుడు, లేబర్ కాలనీకి చెందిన శివుడు, జంపాలశివయ్య నగర్‌కు చెందిన శివన్న, కల్లూరుకు చెందిన కేశవయ్య గౌడ్, సోమిశెట్టి నగర్‌కు చెందిన లక్ష్మన్న తదితరులను అదుపులోకి తీసుకుని వారి వాహనాలను సీజ్ చేసి సోమవారం కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి రెండు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పినట్లు సీఐ శ్రీరాం తెలిపారు.

'స్పందన' సమస్యలను పరిష్కరించాలి

సి.బెళగల్: ప్రజల అర్జీల రూపంలో ఇచ్చిన సమస్యలను మండల, గ్రామ స్థాయి అధికారులు వెంటనే పరిష్కారం అయ్యేలా చూడాలని తహసీల్దార్ శేషఫణి ఆదేశించారు. సోమవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులతో కలిసి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో కంబదహాల్ గ్రామానికి చెందిన రైతులు రామేశ్వరరెడ్డి, గంగిరెడ్డి, సర్వేశ్వరరెడ్డి తమ పొలంను భూ స్వచ్ఛీకరణను చేపట్టి తమ భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు పలు సమస్యలపై అర్జీలు సమర్పించారు. ఎంపీడీఓ రాముడు, ఈఓఆర్డీ సందీప్, ఏఓ మల్లేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

సి.బెళగల్: మండలంలోని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని, ప్రభుత్వ ఆదేశాలు పాటించని పాఠశాలలపై శాఖా పరమైన చర్యలుంటాయని ఎంఈఓలు జ్యోతి, ఆదామ్‌బాష హెచ్చరించారు. సోమవారం వారు మండల కేంద్రం సి.బెళగల్‌లోని శ్రీ సరస్వతీ ప్రైవేట్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల రికార్డులను, అనుమతి పత్రాలను, తరగతుల నిర్వాహణ తదితర అంశాలను పరిశీలించి నిర్వాహకులకు సూచనలు చేశారు. వీరి వెంట సీఆర్పీ శ్రీనివాసులు ఉన్నారు.

వేధింపుల కేసు నమోదు

గడివేముల: మండల కేంద్రమైన గడివేముల గ్రామానికి చెందిన సయ్యద్ షబానా ఫిర్యాదు మేరకు భర్తతో పాటు అత్తపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య సోమవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సయ్యద్ షబానాను ఏడేళ్ల క్రితం మిడుతూరు మండలం తలముడిపి గ్రామానికి చెందిన ఖాజావలికి ఇచ్చి వివాహం చేశారు. తాగుడుకు బానిసైన భర్తతో పాటు అత్త కొన్ని నెలల నుంచి అదనపు కట్నం తీసుకురావాలని వేధిసున్నారు. దీంతో పాటు శారీరకంగా, మానసికంగా హింసిస్తుండటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు భర్తతో పాటు అత్త అంతుల్లాబీలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

వాల్మీకి సభను జయప్రదం చేయండి


పాణ్యం: ఈనెల 23న నంద్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించే వాల్మీకుల ర్యాలీ, సభను జయప్రదం చేయాలని వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షులు పులికొండన్న, ప్రధాన కార్యదర్శి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు లాలిస్వామి పిలుపునిచ్చారు. సోమవారం పాణ్యంలో వాల్మీకుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని నిర్ణయించి, అసెంబ్లీ తీర్మానం చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. అయితే పార్లమెంట్‌లో ఆ బిల్లును అమోదించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. మండలంలోని వాల్మీకి సోదరులు ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, శ్రీనివాసులు, శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

పాణ్యం: మహానంది మండలానికి చెందిన ఓ పాత్రికేయుడిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పాణ్యం నియోజకవర్గ ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పోలీసు సర్కిల్ కార్యాలయంలో ఎస్ఐ పి.అశోక్‌కు వినతి పత్రం అందించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ఓర్వకల్లు : మండల పోలీసు స్టేషన్ పరిధిలోని కర్నూలు–బేతంచెర్ల రహదారిపై వెంకటాపురం వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడిన వ్యక్తి సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. కల్లూరు ప్రజానగర్‌కు చెందిన తెలుగు ఎల్లకృష్ణ కుమారుడు తెలుగు వేణుగోపాల్(27) బేతంచెర్ల మండలం, సీతారాంపురం గ్రామంలో పెళ్లి చేసుకొని అత్తారింటిలోనే స్థిరపడినట్లు తెలిసింది. భార్య భర్తలు ఇద్దరు వ్యవసాయ పనుల చేసుకుంటూ జీవనం చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ క్రమంలో ఆదివారం ఇతను వ్యక్తిగత పనిమీద మోటార్ సైకిల్‌పై కర్నూలుకు వెళ్లాడు. పని ముగించుకొని సీతారాంపురానికి తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలో వెంకటాపురం సమీపంలోని మలుపు వద్ద బైక్ వేగాన్ని అదుపు చేసుకోలేక ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును (ప్రొద్దుటూరు నుంచి కర్నూలుకు వెళ్తున్న ఏపీ 04 జెడ్ 0277 నంబరు గల బస్సు) ఢీకొట్టాడు. దీంతో వేణుగోపాల్ తలకు బలమైన రక్తగాయం కావడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ వెల్లడించారు. మృతుని భార్య తెలుగు జయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్ నారాయణరెడ్డి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు. మృతునికి భార్యతో పాటు ముగ్గురు కుమారులు వున్నట్లు గ్రామస్తులు తెలిపారు.



వేణుగోపాల్(ఫైల్)

సొంత మనిషిలా సేవలు

మండల పరిధిలోని గడిగరేవుల గ్రామానికి చెందిన వలంటీర్ చింతలన్నగారి వెంకటసుబ్బయ్య కరోనా విజృంభిస్తున్న వేళలో తన పరిధిలోని 50 కుటుంబాలకు సొంత మనిషిలాగా సేవలందించాడు. వారానికి రెండు సార్లు ఇంటి వద్దకు వచ్చి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని వ్యాధులపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన మందులను, నిత్యావసర సరుకులను అందజేసేవాడు. అవసరమైన వారికి కరోనా పరీక్షలు చేయించడంతో పాటు ధైర్యంగా ఉండాలని జాగ్రత్తలు చెప్పేవాడు. ప్రతి నెల ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ పింఛన్ కానుకను భయపడకుండా ఇంటి వద్దకు వెళ్లి అందజేసేవాడు.

– గడివేముల



కరోనా సమయంలో పింఛన్ అందిస్తున్న వలంటీరు వెంకటసుబ్బయ్య

ఎంతో ధైర్యంగా ఇంటి వద్దకు వచ్చేవాడు...



మా వలంటీరు వెంకటసుబ్బయ్య కరోనా సమయంలో ప్రతి నెల ఒకటోవ తేదీన ధైర్యంగా ఇంటి వద్దకు వచ్చి పింఛన్ సొమ్మును అందజేసేవాడు. దీంతో పాటు మా కుటుంబ ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకునేవాడు. సొంత కుటుంబసభ్యులే ఇంటి వద్దకు రావాలంటే భయపడే సమయంలో వలంటీరు నేనున్నాంటూ మాలో ధైర్యాన్ని నింపేవాడు. ముందుగానే కరోనా రాకుండా మందులను అందించాడు. –సల్కాపురం పెద్ద వెంకటేశ్వర్లు, గడిగరేవుల గ్రామం

'గడప గడప'తో గ్రామాల అభివృద్ధి



వృద్ధులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- పాణ్యంలో గడప గడపకు మన ప్రభుత్వం

పాణ్యం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో గ్రామాలు అభివృద్ధి బాట పడుతున్నాయని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పాణ్యం సచివాలయం–3 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల వలన కలిగిన లబ్ధిని వివరించారు. అలాగే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాణ్యం మండల కేంద్రంలో నాలుగేళ్ల పాలనతో కోట్ల రూపాయాలతో అభివృద్ధికి బాటలు వేశామన్నారు. ప్రజల సలహాలు, ప్రజా ప్రతినిధుల సూచనలతో పాణ్యానికి అధునాతన రూపురేఖలు తెచ్చామన్నారు. అంతేకాక గడప గడపకు–మన ప్రభుత్వంతో గ్రామాల పర్యటన అనంతరం సచివాలయానికి రూ.20లక్షల నిధులకు తోడు, 14,15 ఆర్థిక సంఘం, ఎఆర్‌జిఈఎస్, మౌనింగ్, సోలార్, మండల ఫండ్‌తో మార్కెట్ యార్డు నిధులతో గ్రామాలకు అభివృద్ధి బాటలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీ పార్వతమ్మ, కో– ఆప్షన్ సభ్యులు జాకీర్ హుసేన్, సర్పంచ్ మేకల పల్లవి, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, చందమామ బాబు, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

టీచర్ నిత్య విద్యార్థిగా ఉండాలి

కర్నూలు(సిటీ): టీచర్ ఎప్పుడూ నిత్య విద్యార్థిగా ఉండాలని పాఠశాల విద్య జాయింట్ డైరెక్టర్ (సర్వీసెస్) మువ్వా రామలింగం అన్నారు. సోమవారం జిల్లాలోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్, అశోక డిగ్రీ కాలేజీలో జరుగుతున్న ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ) శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ శిక్షణ తరగతుల్లో ఆయన ప్రసంగించారు. అత్యవసరంగా జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో ఒక్క సబ్జెక్టు టీచర్ కొరత లేకుండా పదోన్నతులు కల్పించామన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందిస్తోందన్నారు. ఉపాధ్యాయుల హాజరు కోసం 2016–17లో బయోమెట్రిక్ హాజరును తీసుకువస్తే కొందరు బయోమెట్రిక్ మిషన్‌ను ఉద్దేశపూర్వకంగా పాడు చేయడంతో ఫేషియల్ అటెండెన్స్ యాప్‌ను తీసుకురావడం జరిగిందన్నారు. ప్రతి ఒక్క టీచర్ బాధ్యతగా స్కూల్‌కు హాజరై విద్యార్థులకు చదువు చెప్పాలని సూచించారు. శిక్షణ తరగతుల్లో డీఈఓ ఆఫీస్ ఏడీ శామ్యూల్ పాల్, పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వాన్ని వీడాలి

- జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): అధికారులు అలసత్వాన్ని వీడి జగనన్నకు చెబుదాం, స్పందన అర్జీలకు సత్వరమే పరిష్కారాలు చూపాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. స్పందన కార్యక్రమాన్ని అధికారులు అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలన్నారు.అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారాలు చూపించాలన్నారు. అర్జీలు ఎట్టి పరిస్థితుల్లోనూ రీ ఓపెన్ కాకూడదని సూచించారు. కాల పరిమితి లోగా దరఖాస్తులన్నింటినీ పరిష్కరించాలన్నారు.



స్పందనలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

'స్పందన'కు వచ్చిన కొన్ని వినతులు

- గూడూరు మండలం మల్లాపురం గ్రామ పొలిమేరలో తనకు 2.94 ఎకరాల భూమి ఉన్నదని, దానిని వేరేవారు ఆక్రమించుకొని అనుభవిస్తున్నారని, సర్వే చేసి తన భూమిని తనకు ఇప్పించాలని సిబెళగల్ మండలం కొత్తకోటకు చెందిన బి.శివనాగయ్య అర్జీ ఇచ్చారు.
- తాను ఎక్స్ సర్వీసు మెన్ అయినందున 2008లో రాష్ట్ర ప్రభుత్వం 5 ఎకరాల భూమిని ఇచ్చిందని, అయితే దానిని ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా తహసీల్దార్ డిజిటల్ సైన్‌ను తీసి వేశారని, అప్‌లోడ్ చేయించాలని ఓర్వకల్లు మండలం పూడిచెర్లకు చెందిన అహ్మద్ హుస్సేన్ సాహెబ్ అధికారులను కోరారు.
- పిల్లల సమస్యలను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్న ఓర్వకల్లు సాంఘిక సంక్షేమ బాలుర, బాలికల వసతి గృహాల వార్డెన్ ప్రమీల, ఏఎస్‌డబ్ల్యూఓలను సస్పెండ్ చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.సోమన్న, ఈ.శ్రీరాములు గౌడ్ వినతిపత్రం ఇచ్చారు.
- ఆన్‌లైన్ బెట్టింగ్, లివింగ్, ఫ్రెండ్షిప్‌ల పేరుతో ఉన్న యాప్‌లను నిషేధించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, కారుమంచి వినతిపత్రం ఇచ్చారు.

నేడు న్యాయవాదుల విధుల బహిష్కరణ

కర్నూలు(లీగల్) : అవనిగడ్డ బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాది బి.శ్రీనివాసరావుపై జరిగిన దాడికి నిరసనగా మంగళవారం కర్నూలు జిల్లా న్యాయవాదుల సంఘం తమ విధులను బహిష్కరించనున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.నాగభూషణం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎం.వి.చక్రపాణి తెలిపారు. రాష్ట్రంలో న్యాయవాదులపై జరుగుతున్న దాడులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

చిన్నారులకు వ్యాక్సిన్ వేయాలి

కర్నూలు(హాస్పిటల్): ఇంద్ర ధనస్సు కార్యక్రమంలో ఇంటింటి సర్వే నిర్వహించి చిన్నారులకు వ్యాక్సినేషన్ చేయించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య చెప్పారు. సోమవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో యూపీహెచ్‌సీ వైద్యాధికారులకు ఇంద్రధనస్సు కార్యక్రమంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామగిడ్డయ్య మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు, ఆశాల ద్వారా గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించాలని, ఐదేళ్లలోపు పిల్లలు వారీగా రెగ్యులర్ వ్యాక్సిన్ మిస్ అయిన వారిని గుర్తించాలన్నారు. టీకాలు వేయని, పాక్షికంగా టీకాలు వేయించుకున్న పిల్లలందరినీ గుర్తించాలన్నారు. ఇలాంటి వారికి ఈ నెల 25వ తేదీలోగా వ్యాక్సినేషన్ చేయించాలన్నారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ ప్రోగ్రామ్‌లో గర్భిణిలు, బాలింతలు, చిన్నపిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వారికి రక్తహీనత పరీక్షలు నిర్వహించి తగిన చికిత్స అందజేయాలని చెప్పారు. కార్యక్రమంలో డబ్ల్యూహెచ్‌ఓ కన్సల్టెంట్ డాక్టర్ భవాని, డీఐఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డీపీఎంఓ డాక్టర్ ఉమా, ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్ హేమలత, ఎన్‌హెచ్‌ఎం డీపీఓ విజయరాజు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య